మంగోలియా పశువులకు 'మేఘా' పశుగ్రాసం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రతికూల పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న మంగోలియాలోని పశువులను కాపాడేందుకు మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) చర్యలు చేపట్టింది. ప్రస్తుతం మంగోలియాలో విపరీతమైన మంచు కురుస్తున్నది. దీంతో గొర్రెలు, ఆవులు మొదలైనవాటికి పశుగ్రాసం దొరక్క మృత్యువాత పడుతున్నాయి. మంగోల్ ఆయిల్ రిఫైనరీ బృందం తమ దేశంలోని పశువులు, కాపరులను కాపాడేందుకు సాయం చేయాలని అక్కడ గ్రీన్‌ఫీల్డ్ ఆయిల్ రిఫైనరీ నిర్మిస్తున్న ఎంఈఐఎల్‌ను కోరింది. స్పందించిన ఎంఈఐఎల్ ట్రక్కులో పశుగ్రాసాన్ని, కాపరులు చలిని తట్టుకునేలా బ్లాంకెట్లు, ఉలెన్ జాకెట్లు, ఆహారం అందించింది.

కిడ్నీ రోగులకు వరంగా 'పెయిర్డ్ కిడ్నీ డొనేషన్'

- దేశంలోనే సరికొత్తగా రిజిస్ట్రేషన్ కోసం వెబ్‌సైట్ రూపకల్పన
- అదనంగా 40 శాతం మంది రోగులకు ప్రయోజనం
- వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన స్టార్ హాస్పిటల్స్ ఎండీ డా.గోపీచంద్ మన్నెం

బంజారాహిల్స్‌లోని స్టార్ ఆస్పత్రిలో పీకేడీ రిజిస్ట్రీ వెబ్‌సైట్ ఆవిష్కరణ కార్యక్రమంలో స్టార్ ఆస్పత్రి ఎండీ డా.గోపీచంద్ మన్నెం, జీవన్‌దాన్ ఇన్‌చార్జి డా.స్వర్ణలత తదితరులు

బంజారాహిల్స్,ఫిబ్రవరి 22: కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం కుటుంబంలోని దాతలు సిద్ధంగా ఉన్నప్పటికీ, బ్లడ్‌గ్రూప్ మ్యాచ్ కాకపోవడంతో రోగులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని... ఈ నేపథ్యంలో ప్రస్తుతం కేవలం 3-5 శాతం మందికి మాత్రమే అందుబాటులో ఉన్న కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలను ఏకంగా 40 శాతం వరకు తీసుకువెళ్లేందుకు 'పెయిర్డ్ కిడ్నీ డొనేషన్(పీకేడీ)' విధానాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ గోపీచంద్ మన్నెం చెప్పారు. బంజారాహిల్స్ రోడ్ నెం 10లోని స్టార్ ఆస్పత్రిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీవన్ దాన్ ఫౌండేషన్ సీఈవో డా.స్వర్ణలత, స్టార్ ఆస్పత్రి నెఫ్రాలజీ విభాగాధిపతి డా.గంధె శ్రీధర్‌తో కలిసి 'కిడ్నీ స్వాప్ ట్రాన్స్‌ప్లాంట్స్' విధానంలో భాగంగా దాతలు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవడం కోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పీకేడీ విధానం కిడ్నీ రోగులకు వరప్రదాయిని అని అభివర్ణించారు. భారత్‌లో యేటా సుమారు 2 లక్షల మందికి కిడ్నీ మార్పిడి అవసరమవుతుండగా కేవలం 8 నుంచి 10వేల మందికి మాత్రమే కిడ్నీ మార్పిడి అవకాశం లభిస్తున్నదని తెలిపారు. కుటుంబ సభ్యులు కిడ్నీ దానం చేసేందుకు సిద్ధపడినా... బ్లడ్ గ్రూపులు కలవకపోవడంతో మార్పిడి చేయడం సాధ్యం కావడం లేదని చెప్పారు. దీంతో ఎన్నో ఏళ్ల పాటు డయాలసిస్ మీదనే వారు జీవితాన్ని గడపాల్సి వస్తున్నదని తెలిపారు. దీనికి తోడు మధుమేహం, పోషకాల కొరత, అతి తక్కువ శానిటేషన్ వంటి కారణాలతో రోగం కాస్త క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సీకేడీ)గా మారుతున్నదని, దేశంలో దాదాపు 17 శాతం మందిని సీకేడీ వేధిస్తున్నదని వెల్లడించారు. ఇది తీవ్రతరమై చివరకు 'అంత్యదశ మూత్రపిండాల వ్యాధి (ఎండ్‌స్టేజ్ రెనల్ డిసీజ్)'కి దారి తీస్తున్నదని గోపీచంద్ తెలిపారు.

విలువైన ప్రాణాలను కాపాడేందుకే పీకేడీ

కిడ్నీ రోగుల ప్రాణాలను కాపాడేందుకే 'పెయిర్డ్ కిడ్నీ డొనేషన్ (పీకేడీ)'అని అందుబాటులోకి తీసుకువచ్చామని డాక్టర్ గోపీచంద్ తెలిపారు. కిడ్నీ పెయిర్డ్ డొనేషన్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం ద్వారా ఒకే బ్లడ్ గ్రూప్ కలిగిన వేర్వేరు కుటుంబాల్లోని దాతలతో కలుసుకుని తమ వారికి విజయవంతంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేసుకునే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. ఈ విధానం దేశంలో మూత్రపిండాల మార్పిడిలో అనేక విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతుందని గోపీచంద్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జీవన్ దాన్ ఇన్‌చార్జి డా.స్వర్ణలత మాట్లాడుతూ... అవయవ దానంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదని, ప్రస్తుతం అవయవదానంపై ప్రజల్లో కొంత మార్పు వచ్చిందన్నారు. స్టార్ ఆస్పత్రిలో ప్రవేశపెట్టిన పీకేడీ విధానంతో వందలాది మందికి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా రెండు నెలల కిందట పీకేడీ విధానం ద్వారా కిడ్నీ మార్పిడి చేయించుకున్న రఘునాథరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి కుటుంబసభ్యులు తమ అనుభవాలను పంచుకున్నారు.

రక్తంతో వ్యాపారం!

- హైదరాబాద్‌లో 9 బ్లడ్ బ్యాంకులపై దాడులు
- అక్రమాలకు పాల్పడుతున్నట్టు గుర్తింపు
- షోకాజ్ నోటీసులు జారీ చేసిన డీసీఏ అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): మనిషికి ప్రాణాధారమైన రక్తాన్ని సక్రమంగా నిల్వ చేయకుండా, అధిక ధరలు వసూలు చేస్తూ అక్రమ వ్యాపారం చేస్తున్న బ్లడ్‌బ్యాంకుల గుట్టును డీసీఏ అధికారులు రట్టు చేశారు. హైదరాబాద్‌లోని 9 బ్లడ్ బ్యాంకులపై గురువారం డీసీఏ (డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్) అధికారులు ఒక్కసారిగా దాడులు చేశారు. ఈ బ్లడ్ బ్యాంకులు రక్తాన్ని సేకరించడం మొదలు అన్ని దశల్లోనూ నిబంధనలకు తూట్లు పొడుస్తున్నట్టు గుర్తించామని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి తెలిపారు. 9 బ్లడ్ బ్యాంకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. నిబంధనల ప్రకారం రక్తాన్ని సేకరించిన తర్వాత హెచ్ఐవీ, హెపటైటిస్ బీ, సీ, సిఫిలిస్, మలేరియా వంటి టెస్టులు చేయాల్సి ఉంటుంది. దాతల పేర్లు, వారి రక్త పరీక్షల వివరాలను కచ్చితంగా రికార్డుల్లో నమోదు చేయాలి. అయితే కొన్నింటిలో రికార్డుల నిర్వహణ సరిగా లేదని గుర్తించామని డీజీ తెలిపారు. ఏవీఎస్, వివేకానంద బ్లడ్ సెంటర్లలో సేకరించిన రక్తాన్ని పరీక్షించేందుకు టెస్టింగ్ కిట్స్ కూడా లేవని చెప్పారు.

అధిక ధరలకు విక్రయం

కొన్ని బ్లడ్ బ్యాంకులు రక్తం ఉత్పత్తులను అధిక ధరలకు అమ్ముతున్నారని అధికారులు గుర్తించారు. ఫ్రెష్ ఫ్రోజెన్ ప్లాస్మా (ఎఫ్ఎఫ్‌పీ)ను గరిష్ఠంగా రూ.400కు అమ్మాలి. కానీ బాలాజీ బ్లడ్ సెంటర్‌లో ఏకంగా రూ.1500, నందిని బ్లడ్ సెంటర్‌లో రూ.1400కు అమ్ముతున్నట్టు అధికారులు గుర్తించారు. సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్స్‌ను రూ.11 వేలకు అమ్మాల్సి ఉండగా, బాలాజీ బ్లడ్ సెంటర్‌లో రూ.15 వేలు వసూలు చేస్తున్నట్టు నిర్ధారించారు.

నిపుణులు లేరు.. పరికరాలూ లేవు!

కొన్ని బ్లడ్ బ్యాంకులలో పరికరాలు కూడా సరిగా పనిచేయడం లేదని అధికారులు గుర్తించారు. ప్రతిమ సాయి బ్లడ్ సెంటర్‌లో డీప్ ఫ్రీజర్లలో సరైన ఉష్ణోగ్రత పాటించడం లేదని అధికారులు తెలిపారు. ప్రతిమతోపాటు వివేకానంద బ్లడ్ బ్యాంకులో నిపుణులు, నర్సింగ్, ఇతర సిబ్బంది లేనే లేరని చెప్పారు. ఏవీఎస్ బ్లడ్ సెంటర్‌లో రికార్డులు సక్రమంగా నిర్వహించడం లేదని తేల్చారు. ఈ నేపథ్యంలో 9 బ్లడ్ బ్యాంకులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు కమలాసన్‌రెడ్డి తెలిపారు. బ్లడ్ బ్యాంకులు కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందేనని చెప్పారు.

నో టీసులు జారీ అయిన బ్లడ్ బ్యాంకులివే..

1) శ్రీ బాలాజీ బ్లడ్ సెంటర్, నల్లగొండ క్రాస్‌రోడ్, మలక్‌పేట
2) నవ్‌జీవన్ బ్లడ్ సెంటర్, కమలానగర్, చైతన్యపురి
3) ఏవీఎస్ బ్లడ్ సెంటర్, లక్డీకపూల్
4) రుధిర వాలంటరీ బ్లడ్ సెంటర్, లిబర్టీ రోడ్, హిమాయత్‌నగర్
5) ప్రతిమసాయి బ్లడ్ సెంటర ఓల్డ్ ల్యాన్సర్ లైన్స్, శ్రీకర హాస్పిటల్ పక్కన, సికింద్రాబాద్
6) తలసేమియా రక్షిత వాలంటరీ బ్లడ్ బ్యాంక్, పుత్లిబౌలి క్రాస్‌రోడ్, కోఠి
7) వివేకానంద బ్లడ్ సెంటర్, అయోధ్య నగర్ కాలనీ, మెహదీపట్నం
8) నందిని బ్లడ్ సెంటర్, బాలానగర్ క్రాస్‌రోడ్స్
9) ఎంఎస్ఎన్ బ్లడ్ సెంటర్, ఉప్పల్ క్రాస్‌రోడ్

విద్యా - ఉద్యోగ సమాచారం

గురుకుల ప్రిన్సిపాల్ పోస్టుల ఫలితాలు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని తొమ్మిది గురుకుల ప్రిన్సిపాల్ ఉద్యోగాల పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. 2017 నోటిఫికేషన్‌కు సంబంధించి ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల వివరాలను టీఎస్‌పీఎస్సీ తన అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. ప్రిన్సిపాల్ ఉద్యోగాలకు తొమ్మిది మంది అభ్యర్థులను టీఎస్‌పీఎస్సీ ఎంపిక చేసింది. ఇంతకాలం హైకోర్టులో కేసులుండగా, ఈ నెల 13న అన్ని కేసులను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో విత్‌హెల్డ్‌లో ఉన్న ఫలితాలను విడుదల చేస్తూ టీఎస్‌పీఎస్సీ అధికారులు నిర్ణయం తీసుకొన్నారు.

నేటి నుంచి గ్రూప్-1 దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో గ్రూప్-1 స్థాయి ఉద్యోగాల భర్తీకి ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌పీఎస్సీ తెలిపింది. దరఖాస్తుల సవరణకు మార్చి 23 నుంచి 27 వరకు అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ ఏడాది మే లేదా జూన్‌లో ప్రాథమిక పరీక్ష (ఆబ్జెక్టివ్ విధానం), సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మెయిన్ పరీక్ష (కన్వెన్షనల్ విధానం)లను నిర్వహించనున్నట్టు వివరించింది.

మాడల్ స్కూళ్లలో ప్రవేశాలకు గడువు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): 2024-25 విద్యాసంవత్సరానికి రాష్ట్ర మాడల్ స్కూళ్లలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును మార్చి 2 వరకు పొడిగించినట్టు మాడల్ స్కూల్ డైరెక్టర్ రమణకుమార్ తెలిపారు. 7వతరగతి నుంచి పదో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీకి కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. వివరాలకు http://telanganams.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ఎస్‌టీవీసీసీ పరీక్ష ఫలితాలు విడుదల

హైదరాబాద్: షార్ట్‌టర్మ్ వొకేషనల్ సర్టిఫికెట్ కోర్సు (ఎస్‌టీవీసీసీ) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఇంటర్ విద్య అధికారి జయప్రదబాయి తెలిపారు. పరీక్షలకు మొత్తం 1,357 మంది హాజరు కాగా, 1,316 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. ఫలితాల కోసం sive.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సింగరేణిలో 272 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 22: సింగరేణివ్యాప్తంగా తొలివిడతగా ఖాళీగా ఉన్న 272 పోస్టులను భర్తీ చేస్తామని సింగరేణి సీఎండీ బలరాం గురువారం రాత్రి ప్రకటించారు. ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీ (మైనింగ్) ఈ2 గ్రేడ్ 139 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఎఫ్ అండ్ ఏ), ఈ2 గ్రేడ్ 22 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (పర్సనల్) ఈ2 గ్రేడ్ 22 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (ఐఈ) ఈ2 గ్రేడ్ 10 పోస్టులు, జూనియర్ ఎస్టేట్ ఆఫీసర్ ఈ1 గ్రేడ్ పది పోస్టులు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. మేనేజ్‌మెంట్ ట్రైనీ (హైడ్రో జియాలజిస్ట్) ఈ2 గ్రేడ్ 2 పోస్టులు, మేనేజ్‌మెంట్ ట్రైనీ (సివిల్) ఈ2 గ్రేడ్ 18 పోస్టులు, జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్ ఈ1 గ్రేడ్ మూడు పోస్టులు ఉన్నట్టు ఆయన తెలిపారు. జనరల్ డిప్యూటీ మెడికల్ ఆఫీసర్ (జీడీఎంవోస్) ఈ3 గ్రేడ్ 30 పోస్టులు, నాన్ ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో సబ్ ఓవర్సీర్ ట్రైనీ (సివిల్) ఈఅండ్ఎస్ గ్రేడ్-సీలో 16 పోస్టులు భర్తీ చేస్తామని పేర్కొన్నారు. మార్చి 1 నుంచి 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సీఎండీ సూచించారు.

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

బాసర, ఫిబ్రవరి 22: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో విషాదం చోటుచేసుకొన్నది. ప్రాణంగా ప్రేమించిన బావ మృతిని తట్టుకోలేక పీయూసీ వన్ చదువుతున్న శిరీష (17) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకొన్నది. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం దాబూరుకు చెందిన శిరీష.. బుధవారమే ఇంటి నుంచి హాస్టల్‌కు వచ్చింది. గురువారం రాత్రి సూసైడ్ నోట్ రాసి, గదిలో ఉరేసుకొన్నది. మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్టు అధికారులు తెలిపారు.

రంగస్థల కళాకారుడు కాశీభట్ల కృష్ణశాస్త్రి కన్నుమూత

ముషీరాబాద్: ప్రముఖ రంగస్థల కళాకారుడు కాశీభట్ల కృష్ణశాస్త్రి (77) కన్నుమూశారు. జవహర్‌నగర్ టీఆర్టీ క్వార్టర్స్‌లో నివసిస్తున్న కృష్ణశాస్త్రి ఇటీవల త్యాగరాయ గానసభకు వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తలకు బలమైన గాయాలు కాగా, ముషీరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానలో శస్త్రచికిత్స చేశారు. అప్పటి నుంచి ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటూ రెండ్రోజుల క్రితం స్వల్ప అనారోగ్యంతో దవాఖానలో చేరగా, గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పలు నాటకాల్లో పాత్రలు పోషించారు. గానసభ పాలకమండలి సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. కృష్ణశాస్త్రి మృతి పట్ల గానసభ అధ్యక్షుడు జనార్దనమూర్తి, కళా, సాంస్కృతిక సంఘాలు సంతాపం తెలిపారు.

జెన్‌కో జేఎండీగా ఐఏఎస్ అధికారి కృష్ణభాస్కర్

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జెన్‌కోలో కొద్ది రోజుల నుంచి ఖాళీగా ఉంటున్న జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (జేఎండీ) పోస్టు పూర్తి అదనపు బాధ్యతలను ఐఏఎస్ అధికారి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీగా ఉన్న డీ కృష్ణభాస్కర్‌కు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు బాధ్యతలను నిర్వర్తిస్తారని ఇంధనశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్ఏఎం రిజ్వీ తెలిపారు.

ఇంటర్నేషనల్ బడులకు దీటుగా రెసిడెన్షియల్ స్కూళ్లు

- రాష్ట్రవ్యాప్తంగా 100 పాఠశాలల భవనాలు.. రూ.2,500 కోట్ల వ్యయంతో నిర్మాణం
- విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ) : ఇంటర్నేషనల్ పాఠశాలలకు దీటుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణాలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులను రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ మేరకు గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల భవన నిర్మాణాలపై ఆయన విద్యాశాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఇందిరమ్మ రాజ్యంలో పాఠశాలల మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే ఈ ఏడాది రూ.2,500 కోట్ల నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 100 ఎస్సీ, బీసీ, మైనారిటీ గురుకుల పాఠశాలల భవన నిర్మాణాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇందుకు మధిర నియోజక వర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని వివరించారు. ఒక్కొక్క గురుకుల భవనానికి ప్రభుత్వం రూ.25 కోట్ల చొప్పున నిధులను మంజూరు చేసిందని వెల్లడించారు. ఇక నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు కోచింగ్ సౌకర్యార్థం నియోజకవర్గాల వారీగా నాలెడ్జ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం వివరించారు.

పాతరాతియుగపు పనిముట్లు లభ్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం చెల్లాపూర్ సమీపంలో పాత రాతియుగం నాటి పనిముట్లు లభ్యమయ్యాయి. స్థానికంగా 6వ తరగతి చదువుతున్న దొబ్బలి శివకుమార్‌కు ఓ రాతిపనిముట్టు దొరికింది. దానిని తమ ఉపాధ్యాయుల సహకారంతో కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులకు చూపించాడు. ఈ రాతిపనిముట్టు పొడవు 12.5 సెం.మీ., వెడల్పు 8.5 సెం.మీ., మందం 3.5 సెం.మీ.లుగా ఉంది. ఈ రాతిపరికరం ఫొటోలను అంతర్జాతీయ ప్రాక్చరిత్రకారుడు రవికొరిసెట్టర్ (కర్ణాటక), కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ తదితరులు పరిశీలించి అది తొలి పాతరాతియుగం రాతిపనిముట్టు (రాతి గొడ్డలి)గా నిర్ధారించారు. ఈ పనిముట్టు వయసు కనీసం లక్ష సంవత్సరాలకుపైగా ఉంటుందని హరగోపాల్ చెప్పారు.

కృష్ణా తీరంలో బాదామి చాళుక్య ఆలయాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 22(నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా ముదిమాణిక్యం గ్రామం చివర కృష్ణా నది ఒడ్డునే ఉన్న బాదామి చాళుక్య శైలిలోని అరుదైన రెండు ఆలయాలు నేటికీ పదిలంగా ఉన్నాయి. ఈ విషయాన్ని తెలుగు యూనివర్సిటీ ఆర్కియాలజీ విభాగం పబ్లిక్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ హిస్టరీకి చెందిన డాక్టర్ ఎం ఏ శ్రీనివాసన్, ఎస్ అశోక్ కుమార్‌ల బృందం వెలుగులోకి తెచ్చింది. బాదామి చాళుక్య పాలనా కాలం, అంటే క్రీస్తు శకం 543 నుంచి 750 మధ్య కాలంలో ఈ ఆలయాలను నిర్మించారు. తెలంగాణలో అలంపూర్‌లో తప్ప బాదామి చాళుక్యుల ఆలయాలు చాలా తక్కువ సంఖ్యలోనే మిగిలి ఉన్నాయి. ఈ గ్రామంలో దొరికిన మరో చారిత్రక ఆధారం 8 లేదా 9వ శతాబ్దానికి చెందిన బాదామి చాళుక్యుల చివరి కాలం నాటి లఘు శాసనం. 'గండళోణ్రు' అని రాసి ఉన్న లఘు శాసనం గ్రామంలోని ఐదు గుళ్లలో (పంచ కూట)ని ఒక గుడిలోని స్తంభంపై ఉన్నది. ఇందులోని మొదటి రెండు అక్షరాలైన 'గండ'కు అర్థం కన్నడలో వీరుడని ఆర్కియలాజికల్ సర్వే అఫ్ ఇండియా ఎపిగ్రఫీ శాఖ డైరెక్టర్ డాక్టర్ మునిరత్నం భావిస్తున్నారు.

నేరాల అదుపునకు కఠినంగా వ్యవహరించాలి

కానిస్టేబుళ్ల శిక్షణ ప్రారంభోత్సవంలో డీజీపీ రవిగుప్తా

రాజేంద్రనగర్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో పోలీస్ కానిస్టేబుళ్లకు శిక్షణ ప్రారంభం సందర్భంగా నూతన అభ్యర్థులతో డీజీపీ రవిగుప్తా, ఇతర పోలీసు అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, నేరాల అదుపునకు కఠినంగా వ్యవహరించాలని డీజీపీ రవిగుప్తా పిలుపునిచ్చారు. గురువారం రాజేంద్రనగర్‌లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో కానిస్టేబుళ్ల శిక్షణను డీజీపీ రవిగుప్తా, ట్రైనింగ్ విభాగం ఏడీజీ అభిలాష బిష్ట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. సమాజానికి సేవ చేసే ఉద్యోగాన్ని ఎంచుకున్నందుకు పోలీసుగా గర్వపడాలని తెలిపారు. పోలీసు అకాడమీలో శిక్షణ పొందుతున్న వారిలో సుమారు 200 మంది ఇంజినీరింగ్ బ్యాక్‌గ్రౌండ్ క్యాడెట్లు ఉన్నారని, సైబర్ నేరాల నియంత్రణకు వారిని ఉపయోగించుకుంటామని చెప్పారు. ట్రైనింగ్ విభాగం ఏడీజీ, టీఎస్‌పీఏ డైరెక్టర్ అభిలాష బిష్ట్ మాట్లాడుతూ పోలీసు అకాడమీలో రిపోర్ట్ చేసిన 685 మందికి అన్ని అంశాల్లో 9 నెలల పాటు శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐజీ రమేశ్‌రెడ్డి, టీఎస్‌పీఏ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ సీ అనసూయ, డిప్యూటీ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, సీ నర్మద, ఓఎస్డీ ఐ రాఘవరావు, కే శ్రీదేవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అంబర్‌పేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో 481 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు శిక్షణను ఇంటెలిజెన్స్ చీఫ్ ఏడీజీ శివధర్‌రెడ్డి ప్రారంభించగా, పీటీసీ ప్రిన్సిపల్ మధుకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు. చంచల్‌గూడ జైలులో జైల్ వార్డర్ల శిక్షణ ప్రారంభోత్సవంలో జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జైళ్లశాఖ ఐజీలు వై రాజేశ్, ఎన్ మురళీబాబు, డీఐజీ డీ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.70 లక్షలు

నల్లగొండ జిల్లాలోని మిర్యాలగూడ మండలం ఆళ్లగడప వాసి, కానిస్టేబుల్ ధర్మపురి శ్రీకాంత్ కుటుంబానికి రూ.70 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును తన కార్యాలయంలో డీజీపీ రవిగుప్తా గురువారం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో గత డిసెంబర్‌లో శ్రీకాంత్ మరణించాడు. వేతన అకౌంట్ హెచ్‌డీఎఫ్‌సీలో ఉన్నందున బ్యాంకు అధికారులు ఇన్సూరెన్స్ మొత్తాన్ని చెక్కు రూపంలో రాష్ట్ర డీజీపీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఐజీపీ స్టీఫెన్ రవీంద్ర, బ్యాంకు సర్కిల్ హెడ్ విశాల్ భాటియా, జోనల్ హెడ్ జోస్ స్టీఫెన్, రాజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ శంకర్‌పై దాడి

ఎల్బీనగర్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ): న్యూస్ లైన్ జర్నలిస్ట్ శంకర్‌పై దాడి జరిగింది. గురువారం సాయంత్రం ఎల్బీనగర్ ప్రాంతంలో బైక్‌పై వెళ్తున్న ఆయనపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడగా, ఆయన తీవ్రంగా గాయపడ్డారని సమాచారం. రక్తంతో తడిసిన చొక్కాతో ఆయన ఉన్న సంక్షిప్త వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. యూట్యూబ్‌లోనూ, తనకు చెందిన 'తెలంగాణం' డిజిటల్ పత్రికలోనూ ప్రభుత్వ వ్యవహారశైలిని జర్నలిస్ట్ శంకర్ ఎప్పటికప్పుడు ఎండగడుతుంటారు. పలుమార్లు తీవ్ర బెదిరింపులను ఎదుర్కొని మరీ ఆయన తన పంథాను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం ఆయనపై దాడి జరిగింది. శంకర్‌పై జరిగిన దాడిని జర్నలిస్టు సంఘాలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ మద్దతుదారులే దాడికి పాల్పడ్డారని, తెలంగాణలో ఫ్యాక్షన్ తరహా దాడులు మొదలయ్యాయని వారు ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు శంకర్‌పై దాడికి వ్యక్తిగత గొడవలే కారణమని మరికొందరు ప్రచారం చేస్తున్నారు.

గంజాయితో బిగ్‌బాస్ ఫేం షణ్ముఖ్ జల్సా

మణికొండ, ఫిబ్రవరి 22: బిగ్‌బాస్ ఫేం, యూట్యూబర్ షణ్ముఖ్ గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. ప్రేమించి, మోసం చేసిన కేసులో అతడి సోదరుడు సంపత్ వినయ్‌పై బాధితురాలు నార్సింగి పోలీసులను ఆశ్రయించటంతో నాటకీయంగా షణ్ముఖ్ కూడా గంజాయితో దొరికిపోయాడు. వివరాల్లోకి వెళితే.. విశాఖపట్నానికి చెందిన యువతిని సంపత్ వినయ్ ప్రేమించి, పెండ్లి చేసుకుంటానని లైంగికంగా వాడుకొని, తీరా వేరే అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడని బాధితురాలు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మణికొండ పరిధిలోని పుప్పాలగూడ ప్రైస్టేజ్ హైట్స్ అపార్ట్‌మెంట్‌లో షణ్ముఖ్, అతని సోదరుడు సంపత్ వినయ్ ఉంటున్నారని వెల్లడించింది. విచారణలో భాగంగా పోలీసులు సంపత్ కోసం వెళ్లగా అక్కడ షణ్ముఖ్ గంజాయి తాగుతున్నట్టు గుర్తించారు. ఇంట్లో 16 గ్రాముల గంజాయి, పలు రకాల డ్ర